ప్రజాశక్తి
ఆదివారం 2 జూన్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

చల్లబడ్డ వాతావరణం



- హాయినిచ్చిన వర్షం
- తప్పిన ఎండల ముప్పు..

ఊపిరి పీల్చుకున్న జనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒక్కసారిగా శనివారం నాటికి వాతావరణం చల్లబడడంతో విశాఖ నగర వాసులు ఊపిరి పీల్చుకున్నారు. నిన్నటి వరకూ నిప్పుల కుంపటి మాదిరిగా ఎండలు మండడంతో వారంతా ఉక్కిరిబిక్కిరయిన విషయం తెలిసిందే. వేడికి తోడు విద్యుత్ కోతలు ఉండటం, తాగునీటి కష్టాలు వెంటాడటంతో జనం ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉండేవి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వాతావరణం ఒక్కసారిగా కూల్ అయిపోవడంతో జనం ఇళ్లల్లోంచి ఆ రాత్రి వేళ బయటకొచ్చి సేదతీరారు. ఒంటి గంట సమయంలో ఉరుములు, మెరుపులతో వాన కురవడంతో ఒకింత భయానికి గురైనా అంతలోనే తేరుకున్నారు. వాస్తవానికి పెద్ద శబ్దాలతో పిడుగులు పడడంతో పలుచోట్ల ప్రజల్లో భయాందోళన నెలకొంది. అలా శనివారం ఉదయం వరకూ వర్షం కురిసింది. వాతావరణంలో కొంత మేరకు మార్పు వచ్చింది.

తగ్గనున్న ఉష్ణోగ్రతలు

ప్రస్తుతం రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఉష్ణోగ్రతలు సైతం శనివారం అదుపులోకి వచ్చినట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. పలుచోట్ల శనివారం 30 నుంచి 32 డిగ్రీలలోపే వేడి ఉంది. నైరుతి త్వరలోనే రాష్ట్రమంతటా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలకు లోటు ఉండదని సంబంధిత అధికారుల నివేదికలు తెలియజేస్తున్నాయి.

వర్షంతో ఇక్కట్లు

శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ కురిసిన వర్షంతో పలుచోట్ల విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మంచినీటికి జనం నగరంలో అవస్థలు పడ్డారు. పలుచోట్ల కరెంట్ లేక జివిఎంసి తాగునీరు అందలేదు. సాగర్‌నగర్, కెఆర్‌ఎం కాలనీ, అక్కయ్యపాలెం, ఎంవిపి కాలనీ, ఎండాడ, భీమిలి, మధురవాడ, పిఎం.పాలెం, మద్దిలపాలెంల్లో ఈ అవస్థలు ప్రజానీకానికి తప్పలేదు. బోరింగుల వైపు జనం శనివారం తెల్లవారు నుంచీ పరుగులు తీశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లులో భాగంగా తాగునీటి ట్యాంకులను పలు చోట్లకు జివిఎంసి పంపినప్పటికీ అవి ఏ మూలకూ సరిపోలేదు. ప్రజలు వాటర్ సేల్స్ సెంటర్లను ఆశ్రయించి నీటిని కొనుక్కున్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున, చిత్రంలో సిపి రవిశంకర్

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి

విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓట్ల లెక్కింపునకు జిల్లాలో దాదాపు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయని విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఎయు ఇంజినీరింగ్ కళాశాలలో ఏడు కౌంటింగ్ కేంద్రాల్లో ఈ నెల 4న ఉదయం 8 గంటలకే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌తో కలిసి శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మల్లికార్జున పలు అంశాలపై మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, 144 సెక్షన్, ఇతర విధివిధానాలను వివరించారు. అధికారులు, సిబ్బంది కౌంటింగ్ కేంద్రాలకు ఉదయం 6 గంటలకల్లా చేరుకోవాలన్నారు. జిల్లాలో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎవరికీ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 3 నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులను మూసి వేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని ఈఈఈ బ్లాక్ సెమినార్ హాలులో, మిగతా 2లో..

ఖరీఫ్‌కు వ్యవసాయశాఖ సన్నద్ధం కావాలి

▶ వార్త 5లో..

కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

▶ వార్త 2లో..

సినీ గేయ రచయిత జాలాది భార్య మృతి

▶ వార్త 2లో..

75 శాతం పింఛన్ సొమ్ము పంపిణీ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని 24 మండలాల్లో శనివారం 75 శాతం వరకూ పింఛన్ సొమ్మును సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. జిల్లాలో మొత్తం 2,64,526 మంది పింఛన్‌దారుల్లో ఇళ్లకు వెళ్లి అందజేయాల్సిన లబ్ధిదారులు 71,177 మంది వున్నారు. వీరికి రూ.18.99 కోట్లు ఇవ్వాల్సివుంది. 71,177 మందిలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం 5.10 వరకు 53,453 మందికి (75 శాతం) రూ.14.28 కోట్లు పింఛన్ సొమ్ము అందజేశారు. అత్యధికంగా అనకాపల్లి పట్టణంలో 92 శాతం వరకు పంపిణీ చేశారు. నక్కపల్లి మండలంలో తక్కువగా 62 శాతం జరిగింది. ఆదివారం నాటికి శత శాతం ఫించన్ సొమ్ము లబ్ధిదారులకు అందించడానికి ప్రయత్నిస్తున్నామని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కె.సచిదేవి తెలిపారు. సాయంత్రం మిగతా 2లో..



సబ్బవరంలోని బుడగ జంగాల కాలనీలో ఎరకమ్మకు పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

మామిడి పండ్ల మేళా అదుర్స్

గిరిజన భవన్‌కు పోటెత్తిన నగరవాసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీ డబుల్ రోడ్డులోగల గిరిజన భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మామిడి పండ్ల మేళాకు నగర వాసులు పోటెత్తారు. సహజ సిద్ధంగా పండించి, ముగ్గించిన వివిధ రకాల జాతుల మామిడి పండ్లను ఇక్కడ ప్రదర్శనకు, అమ్మకానికి ఉంచారు. తొలుత ఈ మేళాను ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం రాష్ట్ర ప్రతినిధి పిఎల్‌ఎన్.రాజు ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మామిడి రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో రెండు రోజులపాటు ఈ మేళాను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే తలంపుతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.





గిరిజన భవన్‌లో మామిడి పండ్లు కొంటున్న విశాఖ నగర వాసులు

మామిడిని సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తులసి నేచురల్స్ ప్రతినిధి సత్యన్నారాయణ, పాలెం నేచురల్స్ ప్రతినిధి చవ్వాకుల అశోక్, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

75 శాతం పింఛన్ సొమ్ము పంపిణీ

ఆరు గంటల వరకు పింఛన్ అందజేత కొనసాగడంతో పింఛన్ సొమ్ము 80 శాతం వరకు పంపిణీ జరిగి ఉండొచ్చని తెలియజేశారు. 2,64,526 మంది పింఛన్‌దారుల్లో 1,93,349 మంది పింఛన్‌దారులకు రూ.77 కోట్లను వారి బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమచేసింది. ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయడంలో సచివాలయ సిబ్బంది మంచి కృషి చేశారని డిపిఎం పి.వెంకటరమణ తెలిపారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి

తొలి అంతస్తు రూమ్ నెంబరు 4లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఏయే నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఎయులోని ఏయే ప్రాంతాల్లో జరుగుతుందో వివరించారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఎయు పరిధిలో ఏడు హాళ్లు గుర్తించామని తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా మొత్తం 997 మందిని కౌంటింగ్ కోసం కేటాయించామన్నారు. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లుగా నియామక పత్రం ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఒక అధికారిక వీడియోగ్రాఫర్ ద్వారా మొత్తం కౌంటింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తామని చెప్పారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని వివరించారు. కౌంటింగ్ కేంద్రాలలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకూ అనుమతి లేదని తెలిపారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన వివరాలు అందించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద మీడియా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు.

ఏజెంట్లకు ఆల్కహాల్ పరీక్ష నిర్వహిస్తాం : పోలీస్ కమిషనర్ రవిశంకర్

అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్లుగా వచ్చే వారికి ఆల్కహాల్ పరీక్ష నిర్వహిస్తామని, అందుకు బ్రీత్ ఎనలైజర్లను అందుబాటులో ఉంచామని సిటీ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవివంకర్ తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం లెక్కింపు కేంద్రాలవద్ద కౌంటింగ్ అధికారులకు, ఏజెంట్లకు వేర్వేరుగా పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సోషల్ మీడియా ద్వారా ఇతరులను కించపరిచేలాగానీ, రెచ్చగొట్టే విధంగాగానీ ఎలాంటి పోస్టులూ చేయరాదని హెచ్చరించారు. కేంద్రాల పరిధిలోకి వచ్చే వారు, విధుల నిర్వహణ నిమిత్తం వచ్చే వారు తప్పకుండా ఐడి కార్డులు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిసెంబర్ 27, 28, 29 తేదీలలో కూచిపూడి గ్రామంలో కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కళా రత్న, విశాఖపట్నం కూచిపూడి కళా కేంద్రం డైరెక్టర్ ఎబి.బాల కొండలరావు, సెంట్రల్ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రామలింగ శాస్త్రి తెలిపారు. శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో కూచిపూడి నాట్య అకాడమీ, అభినయం స్కూల్ ఫర్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య కళాకారుల, శిక్షకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాల పోస్టర్, వెబ్‌సైట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంపటి చిన సత్యం కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. భారతదేశంలో పాటు అనేక దేశాలలో కూచిపూడి నృత్యం ప్రసిద్ధి చెందిందని తెలిపారు. కూచిపూడి గ్రామంలో జరిగే పతాక స్వర్ణోత్సవాల కార్యక్రమానికి పలు దేశాల నుంచి ప్రతినిధులు, గొప్ప గొప్ప నాట్య విద్వాంసులు రానున్నారని చెప్పారు. సమావేశంలో వేదాంతం వెంకట నాగ చలపతిరావు, డాక్టర్ పసుమర్తి వెంకటరమణ పాల్గొన్నారు.

సినీ గేయ రచయిత జాలాది భార్య మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ తెలుగు సినీ రచయిత కీర్తిశేషులు జాలాది రాజారావు సతీమణి జాలాది ఆగ్నేశమ్మ శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచారు. జాలాదిగా పేరుగాంచిన జాలాది రాజారావు 275 సినిమాల్లో 1500కు పైగా పాటలను రచించారు. సినీ గేయ రచయితగా ఆయన ప్రయాణంలో జాలాది ఆగ్నేశమ్మ ప్రముఖ పాత్ర పోషించారు. ఆమె మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు సంతాపం తెలియజేశారు. ఆగ్నేశమ్మ కుమార్తె డాక్టర్ జాలాది విజయ అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నగరంలో నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. ప్రస్తుతం విశాఖపట్నం పార్లమెంట్ స్థానం నుంచి సమాజ్ వాది పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆగ్నేశమ్మ అంత్యక్రియలు ఆదివారం జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

వేడెక్కించిన ఎగ్జిట్ పోల్స్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల లెక్కింపునకు రెండ్రోజుల ముందు శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్‌పోల్స్ ప్రధాన రాజకీయ పార్టీల్లో టెన్షన్ సృష్టించాయి. మే 13న పోలింగ్ తరువాత గెలుపు అంచనాలపై ఎవరి ధీమాలో వారుండగా తాజాగా విడుదలైన ఎగ్జిట్ పోల్స్ ఒక్కసారిగా వారిని టివిలకు అతుక్కుపోయేలా చేశాయి. వివిధ సర్వే సంస్థలు, మీడియా వెల్లడించిన అభిప్రాయాలు ఎంతవరకు వాస్తవానికి దగ్గరగా వున్నాయనేది జూన్ 4న జరిగే లెక్కింపు రోజుగానీ తెలీదు. అంతవరకూ అభ్యర్థులు, వారి అనుయాయులు సర్వేలు ఎవరికి అనుకూలంగా వుంటే వారు తమకు అన్వయించుకొని సంతోషపడటమే తప్ప ఫలితమని సంతృప్తిపడే అవకాశం లేదు. ఎగ్జిట్‌పోల్స్ చూసి వైసిపి, టిడిపి, జనసేన అభ్యర్థుల తరపున విజయావకాశాలపై బెట్టింగ్‌లు వేసే వారి సంఖ్య పెరగడం ఆరంభమైంది. ఎగ్జిట్‌పోల్స్‌తో ఎవరు గెలుస్తారు ? ఎవరు ఓడిపోతారు ? అన్న చర్చ ప్రజల్లో సర్వత్రా సాగుతోంది.

ఇప్పుడు పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. నిఘా, బందోబస్తు పెంచారు. 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు అల్లర్లు జరగకుండా విశాఖపట్నం, అనకాపల్లి పోలీసు, ఎన్నికల అధికారులు చాలా తీక్షణంగా పరిస్థితులను సమీక్షించి, సూచనలు చేస్తున్నారు. శాంతిభద్రతలకు, ప్రశాంతతకు భంగం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



ఎన్నికల సందర్భంగా చెప్పుకోదగిన గొడవలు, అల్లర్లు నమోదుకాలేదు. తరువాతా కూడా చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎగ్జిట్‌పోల్స్ వేడి ఇలావుంటే మరోవైపు ఉష్ణోగ్రతలు జనాలను అతలా కుతలం చేస్తున్నాయి. వర్షాల్లేక, వాతావరణం మనిషిని ఉక్కిరిబిక్కిరి చేయడంతో ఉక్కపోతకు తట్టుకోలేక కూలర్లు, ఎసిల వినియోగం పెరిగింది. విద్యుత్ వాడకానికి, విద్యుత్ కేటాయింపులకు మధ్య సమతుల్యత లేకపోవడంతో అనధికారిక విద్యుత్ కోతలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగమంతా ఎన్నికల పనిలో వుండడంతో ప్రజల సమస్యలు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పని ప్రాంతంలో కనీస సదుపాయాల్లేకపోయినా అధికారులు పట్టించు కోవడం లేదు.

మండుటెండల్లో పనిచేస్తున్న కూలీలకు తాగునీటి సదుపాయం, టార్పాలిన్లు ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశంలోని కూలీల దగ్గరకు వెళ్లి వారి కష్టాలను తెలుసుకొని రోజు వేతనం రూ.600కి పెంచాలని, చట్టప్రకారం సదుపాయాలు కల్పించాలని సిపిఎం, సిఐటియు, రైతు సంఘం చేస్తున్న డిమాండ్ సముచితమైనది. నాయకులు ఎన్నికలకు పరిమితం కాకుండా ప్రజల కష్టాలపై స్పందించి కాస్తయినా ఊరట కల్పించాలి.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యాన రిటైల్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో నిర్వహించిన రిటైల్ ఎక్స్‌పోకు స్పందన లభించిందని బ్యాంకు రీజనల్ మేనేజర్ నరసింహ కుమార్ తెలిపారు. నగరంలోని ప్రముఖ బిల్డర్లు, వాహన డీలర్లు, విద్యా రుణాల ఏజెన్సీలు పాల్గొని వారి వాణిజ్య విధానాలను ప్రజలకు తెలియజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ షాలిని మీనన్, వైస్ జోనల్ మేనేజర్ శంకర్ హేమ్ రామ్, రీజనల్ మేనేజర్ నరసింహ కుమార్ పాల్గొని బ్యాంకు రిటైల్ రుణాల గురించి వివరించారు.



ఎక్స్‌పోలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

ఘనంగా ముగిసిన సమ్మర్ క్యాంపు



'గురజాడ మా అడుగుజాడ' పాటకు నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ, శ్రీ సాయి కళానికేతన్, రాగిణి కూచిపూడి నాట్యమండలి సంస్థల సంయుక్తాధ్వర్యాన నెల రోజుల పాటు ఎన్ఎడి కొత్త రోడ్‌లోని హష్మీ భవనంలో జరిగిన సమ్మర్ క్యాంపు (సంగీతం, నాట్యం, శిక్షణ వేసవి శిక్షణ శిబిరం) ముగింపు వేడుకలు శుక్రవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సాగాయి. ముఖ్య అతిథులుగా ఎయు ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ ప్రిన్సిపల్ నరసింహారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభక్తి, అభ్యుదయ భావాలతో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఇటువంటి శిబిరాలు, కళా ప్రదర్శనలు విస్తృతం కావాల్సి ఉందన్నారు. ప్రజానాట్యమండలి, శ్రీ సాయి కళానికేతన్ సంస్థలు చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా 'ఎగరేద్దాం తెలుగు భాష జెండా' డ్యాన్స్, దేశమును ప్రేమించుమన్నా, లుంగీ డ్యాన్స్, నెమలికి నేర్పిన నాట్యం డ్యాన్స్, పర్యావరణ పరిరక్షణ నాటిక, గురజాడ మా అడుగుజాడ డ్యాన్స్ ప్రదర్శనలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథులు వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న పిల్లలకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎం.చంటి, డ్యాన్స్ టీచర్ పద్మనాగిని, సంగీతం టీచర్ శ్రీదేవి, పిఎన్ఎం సీనియర్ నాయకులు అరుణ్‌జీ, అనన్య, పిల్లల తల్లిదండ్రులు సుబ్బారావు, పుణ్యవతి, శ్రీనాథ రామచంద్రరావు, ప్రత్యూష, మోహన్‌రావు, భాను, సత్య పాల్గొన్నారు.



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు

సాగని వేట.. అందని పరిహారం..



వేట లేక ఒడ్డున ఉన్న బోట్లు

ఆర్థిక ఇబ్బందుల్లో మత్స్యకారులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఏటా వేట విరామ సమయంలో ప్రభుత్వం అందజేసే పరిహారం (భృతి) నేటికీ మత్స్యకారులకు అందలేదు. మత్స్యకార భరోసా పథకం కింద ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. ఏటా ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు వేట నిషేధకాలంగా పరిగణిస్తారు. చేపలు గుడ్లు పెట్టే కాలంలో వేట సాగిస్తే పునరుత్పత్తి దెబ్బ తింటుంది గనుక ఆ సమయంలో వేట నిషేధం అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పర్యావరణ పరంగానూ ఈ నిర్ణయం సరైందే. అయితే ఆ సమయంలో చేపల వేట పైనా, అనుబంధ రంగాల పైనా ఆధారపడే మత్స్యకారుల ఉపాధి పూర్తిగా దెబ్బతింటుంది.

మోటారైజ్డ్ బోటుపై ఆరుగురు, మెకనైజ్డ్ బోటుపై 8 మంది, తెర చాపపై ముగ్గురు చొప్పున వేటకు వెళ్తారు. మండలంలో మోటారు బోట్లు 289, తెప్పలు 191 ఉన్నాయి. మండలంలో అటు అన్నవరం మొదలు కొని ఇటు జివిఎంసి నాలుగో వార్డు మంగమారిపేట వరకు సుమారు 18 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది.

సవాలక్ష నిబంధనలు..

పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు పెట్టింది. ఇందులో భాగంగా లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేసేందుకు మత్స్యశాఖ అధికారులు ఇటీవల చేపట్టిన ఎన్యూమరేషన్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. అయితే గతేడాది 2087 మందిని లబ్ధిదారులుగా గుర్తించిన ఆ శాఖ అధికారులు ఇప్పుడేమో 2,307 మందిని గుర్తించారు. పింఛను పొంది ఉంటే పరిహారం ఇవ్వరు.

ఆర్థికంగా ఇబ్బందులు

ఓ వైపు వేట లేదు. మరో వైపు ఉపాధి లేదు. పరిహారం ఇంకా అందలేదు. దీంతో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.



కాసరపు భీమరాజు, మత్స్యకారుడు, బోయివీధి, భీమిలి

పరిహారం త్వరగా ఇవ్వాలి

ఇచ్చే పరిహారం త్వరగా ఇస్తే ఉపయోగం. ముందుగా ఇస్తే ఉపాధితో పాటు వేట సామాగ్రికి అవసరమయ్యే పని ముట్లు, సామగ్రి కొనుక్కునే వీలుంటుంది.



కాసరపు సత్తిరాజు మత్స్యకారుడు, భీమిలి

నేరాలు ఘోరాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని ఆర్.తాళ్లవలసలో అదే గ్రామానికి చెందిన శ్రీను నుంచి 180 మిల్లీ లీటర్ల 11 మద్యం బాటిళ్లను ఎస్ఇబి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్నందున శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు సిఐ వి.రామకృష్ణ తెలిపారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న జైజవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు

జై జవాన్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కేన్సర్ బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. విజయనగరం జిల్లా సవరవల్లి గ్రామానికి చెందిన బాడితబోయిన సాయి గణేష్ (5) ఒక సంవత్సర కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ విశాఖపట్నంలోని ఒమేగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. తల్లిదండ్రులు బాడితబోయిన రాంబాబు, సన్యాసమ్మది నిరుపేద కుటుంబం కావడంతో ఆనందపురం గ్రామంలో ఉన్న జై జవాన్ ఫౌండేషన్‌ను సాయం కోరగా సభ్యులు స్పందించి ఫేస్‌బుక్ వాట్సప్ ద్వారా అబ్బాయికి సంబంధించిన పోస్టులు చేసి ఫోన్ పే ద్వారా రూ.28 వేలు స్వీకరించారు. ఆనందపురం జడ్‌పిహెచ్ స్కూల్ 2007 బ్యాచ్ తరుపున కోటేశ్వరరావు రూ.5 వేలు, 416 బ్యాచ్ సిఆర్‌పిఎఫ్ జవాన్లు రూ.5వేలు సహాయం చేశారు. జై జవాన్ ఫౌండేషన్ ద్వారా హాస్పిటల్లో రోగి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కుప్ప రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, సెక్రటరీ ముడసల కార్తీక్, జనరల్ సెక్రటరీ ఇమంది శ్రీనివాసరావు, కోశాధికారి కుప్ప రామలక్ష్మి, కుప్ప శ్రీను, కుప్ప అప్పారావు, శ్రీను, చిరంజీవి, రాము, గణేష్, ఆనంద్, రాజు, వంశీ, బంగార్రాజు పాల్గొన్నారు.

ఉక్కపోత.. కరెంట్ కోత...

ప్రజాశక్తి -తగరపువలస : ఓ వైపు ఉక్క పోత, మరో వైపు కరెంట్ కోతతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. గత కొద్ది రోజులుగా తీవ్ర వడ గాలులకు జనం ఉక్కపోతతో సతమతం అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కాసింత ఉపశమనం పొందారు. అయితే శుక్ర వారం రాత్రి, శనివారం సాయంత్రం వేళల్లో కరెంట్ కోతలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి. కరెంట్ కోతలు లేకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి -యంత్రాంగం


తగరపువలస : అనకాపల్లి మాజీ ఎంపీ సబ్బం హరి జయంతి సందర్భంగా శనివారం స్థానిక వెంకటేశ్వర స్వామి, కనకదుర్గ ఆలయాల ప్రాంగణంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. సబ్బం హరి యువసేన అధ్యక్షులు కాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిట్ట వెంకటరావు, తెలుగు యువత నాయకులు జి.ప్రతాపరెడ్డి, మానవ హక్కుల ఫోరం సభ్యులు కె.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఆరిలోవ : సబ్బం హరి 72వ జయంతిని పురస్కరించుకొని భీమిలి నియోజకవర్గం సబ్బం హరి యువసేన ఆధ్వర్యాన పాతడెయిరీ ఫారం వద్ద గల ఆనంద్ మార్గ్ ఆశ్రమం విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ముందుగా సబ్బం హరి చిత్రపటానికి 10వ వార్డు టిడిపి నాయకులు మద్దిల రాజశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు డొంక రామ దీపక్, సబ్బం హరి అభిమానులు సింగంశెట్టి రామకృష్ణ, ఆనంద్ మార్గం ఆశ్రమం నిర్వాహకులు సౌమ్యానంద పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న రాజశేఖర్

కారాగారాల్లో సంస్కరణల అమలుకు కమిటీలు



విలేకర్లతో మాట్లాడుతున్న ఇండ్ల శ్రీనివాసరావు

జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు

ప్రజాశక్తి – ఆరిలోవ : దేశంలో కారాగారాల ఆధునీకరణ, పటిష్ట సంస్కరణలు అమలు, అభివృద్ధి, జైలు ఉద్యోగులకు పటిష్టమైన శిక్షణ తదితర వాటికోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమించిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ కేంద్రకారాగారాన్ని సందర్శించిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో జైళ్ల ఆధునీకరణ, సంస్కరణల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్యూర్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ పోలీస్ రీకనస్ట్రక్షన్ డెవలప్‌మెంట్ (బిపిఆర్‌డి) ఆధ్వర్యాన ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెండు జాతీయ కమిటీలకు తనను ఛైర్మన్‌గా నియమించారని చెప్పారు. ఈ కమిటీలు దేశవ్యాప్తంగా ఉన్న జైళ్లను పరిశీలించి వాటికి అనుకూలమైన వ్యవహారాలకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు నెల రోజులుగా ఈ కమిటీలు పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ కమిటీల ద్వారా దేశంలో ఎక్కడైనా కొత్తగా జైలు ఏర్పాటు చేయాలంటే ఎలాంటి స్థలంలో జైలును నిర్మించాలి, జైలు నిర్మాణానికి అనుకూలమైన వాతావారణం ఉంది, వాతావరణానికి తగ్గట్లు ఎలాంటి సౌకర్యాలు, మౌలిక వతసతులు ఉండాలి, గ్రీనరీ ఏవిధంగా ఉండాలి, ఎలాంటి రక్షణ గోడలు ఉండాలి, జైలుకు వేసే రంగులు తదితర వాటి గురించి 50 సంవత్సరాలు జీవిత కాలం ప్రామాణికంగా చేసుకొని నివేదిక సిద్ధం చేసి కేంద్రక హోం శాఖకు నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు.

ముగిసిన రగ్బీ పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాల్గో వార్డు తిమ్మాపురం విజ్ఞాన్ ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 31న ప్రారంభమైన రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ బాల బాలికల ఛాంపియన్ షిప్ పోటీలు శనివారంతో ముగిశాయి. 9వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో అనంతపురం, బాలుర విభాగంలో నెల్లూరు జట్లు ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నట్లు ఎపి రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత్ కుమార్, కిషోర్ కుమార్ తెలిపారు.

బాలుర విభాగంలో నెల్లూరు, కర్నూలు, తూర్పు గోదావరి జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం, గుంటూరు, తూర్పు గోదావరి జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజ్ఞాన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ చైతన్య, వేదాంత సంస్థ వ్యవస్థాపకులు రాజశేఖర్, ప్రకృతి విద్యా సంస్థల అధిపతి శ్రీనివాసులు విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసి అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న అనంతపురం బాలికల జట్టు క్రీడాకారులు



సదస్సులో మాట్లాడుతున్న ఎసిపి సునీల్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి -తగరపువలస : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నార్త్ జోన్ ఎసిపి సునీల్ స్పష్టం చేశారు. "సార్వత్రిక ఎన్నికలు, శాంతి భద్రతల పరిరక్షణ" అంశంపై స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శనివారం సదస్సు నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరైన ఈ సదస్సునుద్దేశించి ఎసిపి సునీల్ మాట్లాడుతూ, ఈ నెల 4న ఓట్ల లెక్కింపు అనంతరం ఎక్కడైనా అల్లర్లకు పాల్పడినా, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఫలితాలు ఎలా వచ్చినా హుందాగా స్వీకరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిఐ డి.రమేష్, ఎస్ఐలు జి.హరీష్, పైడిరాజు పాల్గొన్నారు.



ఇంకుడు గుంత పనులను ప్రారంభిస్తున్న జియ్యాని శ్రీధర్

శాంతినగర్ పార్కులో ఇంకుడు గుంత

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి శాంతినగర్ పాలకవర్గం సభ్యులు ఆ ప్రాంత పార్కు ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టారు. ఈ పనులను డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహా విశాఖ నగరంలో రోజు రోజుకూ భూగర్భ జలాలు ఎండిపోతున్నాయన్నారు. బహుళ అంతస్తుల నిర్మాణాలు, రోడ్డు నిర్మాణాల వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేకుండా పోతుందని తెలిపారు. దీనికి పరిష్కారంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఇంటి బోరు ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఇంకుడు గుంతలు ఉండటం వల్ల మన బోరు బావి ప్రాంతంలో నీటి సామర్థ్యం ఎప్పటికి తగ్గుముఖం పట్టదన్నారు. కార్యక్రమంలో శాంతినగర్ పార్కు పాలకవర్గం సభ్యులు శీనివాసరావు, సత్యనారాయణ, ఈటి సత్యనారాయణ, దామోదరరావు, జియ్యాని విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



బహుమతి సాధించిన విద్యార్థులు వీరే..

నిర్మల మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -గాజువాక: అఖిల్ లోక్ కళ సాంస్కృతిక సంస్థ భారత్ ఉత్సవ పేరుతో గత నెల 22న పూణేలో జరిగిన అంతర్జాతీయ సంగీతం, నృత్య పోటీల్లో గాజువాక నిర్మల డాన్స్ అకాడమీ విద్యార్థులు బహుమతులు సాధించినట్లు నిర్వాహకులు ఎన్ వెంకట్రావు తిలగవతి తెలిపారు. శాస్త్రీయ సంగీతం, కూచిపూడి నృత్యంలో మొత్తం 30 విభాగాలు పాల్గొన్నట్లు వివరించారు. సంగీతంలో పది ప్రథమ బహుమతులు, రెండు ద్వితీయ బహుమతులు, మూడు తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. కూచిపూడి నృత్యంలో 32 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. దీనిలో 10 మొదటి బహుమతులు, ఆరు ద్వితీయ బహుమతులు, నాలుగు తృతీయ బహుమతులు సాధించినట్లు వివరించారు. గెలిచిన వారికి అభినందనలు తెలిపారు.

కేంద్రకారాగారానికి డిజిటల్ హెల్త్ ఎటిఎం వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : కేంద్రకారాగారంలో ఖైదీ ఆరోగ్య పరీక్షల కోసం సింబయాసిస్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ నరేష్ కుమార్, జెమ్ ఓపెన్ క్యూబ్ టెక్నాలజీస్ ప్రయివేటు లిమిటెడ్ హైదరాబాద్ సిఇఓ డాక్టర్ వినోద్‌కుమార్, విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ మధుసూదనరావు ఆర్థిక సాయంతో ప్రణామ్స్ హాస్పిటల్, జెమ్ ఓపెన్ క్యూబ్ టెక్నాలజీస్ వారిచే తయారుచేసిన డిజిటల్ హెల్త్ ఎటిఎం మెషిన్‌ను విశాఖ కేంద్రకారాగారానికి వితరణగా అందజేశారు. విశాఖ కేంద్రకారాగారంలో ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావుకు ఈ డిజిటల్ హెల్త్ ఎటిఎం మిషన్‌ను శనివారం అందజేశారు. ఈ ఏటిఎం మిషన్ ద్వారా 75 హెల్త్ చెక్ అప్ ఫలితాలు రెండు నుంచి మూడు నిమిషాలలో పూర్తి ఖచ్చితత్వంతో రిపోర్ట్సు తెలుసుకోవచ్చని ఐజి ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరికరం సేవలు త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్. కిషోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ ఉన్న వారికే గుర్తింపు



మాట్లాడుతున్న ఎసిఎ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి

క్రికెట్‌లో క్రమశిక్షణ అవసరం
ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -పిఎం పాలెం : ప్రతిభ ఉన్న వారికే గుర్తింపు ఉంటుందని ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. క్రికెట్‌లో క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. విడిసిఎ ఆధ్వర్యాన నిర్వహించిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు ముగింపు సమావేశం శనివారం డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ-విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతిభ కలిగి గుర్తింపులేని క్రికెటర్లకు రైజింగ్ స్టార్స్ పేరుతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇటీవల ఒక చక్కటి వేదికను కల్పించామని తెలిపారు. దీంతో ఎసిఎ విడుదల చేసిన వేలం అర్హత జాబితాలో లేని ఆటగాళ్లకు ట్రయల్స్ నిర్వహించి ప్రతిభ చూపిన ఏడుగురికి ఎపిఎల్ -3 వేలంలో స్థానం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడి గణాంకాలతో కూడిన పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు వీలుగా ఈసారి సరికొత్త సాఫ్ట్ వేర్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్లు, కోచ్‌లకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎసిఎ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.కుమార్, విడిసిఎ అధ్యక్ష, కార్యదర్శులు పి.విష్ణుకుమార్‌రాజు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం: సమగ్ర శిక్ష విశాఖపట్నం సహిత విద్యా విభాగం 2024-25 విద్యా సంవత్సరానికి ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు, నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆనందపురం మండలం సహిత విద్యా విభాగం ఉపాధ్యాయులు కలమట శ్రీనివాసరావు, ఐ.నాగమణి చేస్తున్న గుర్తింపు కార్యక్రమాన్ని జిల్లా సహిత విద్యా విభాగం సమన్వయకర్త బి.గీత శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ, వికలాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న పలు సేవలను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. మండల భవిత కేంద్రంలో ప్రభుత్వం అందచేస్తున్న ఫిజియోథెరపీ, ట్రాన్స్ పోర్ట్, ఎస్కార్ట్, గర్ల్ స్టైఫండ్, వీల్ ఛైర్లు, ట్రై సైకిల్, వినికిడి పరికరాలు, ఎమ్మార్ కిట్స్, ఇంటి వద్దనే విద్య వంటి వివిధ సేవలుపొందగలరని వివరించారు. తల్లిదండ్రులు వికలాంగ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి భవిత కేంద్రాలకు పంపించాలని కోరారు.

పెందుర్తి : రాష్ట్ర సమగ్ర శిక్షణ పథక సంచాలకులు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న గుర్తింపు నమోదు కార్యక్రమంలో భాగంగా పెందుర్తిలో 0 నుంచి 18 సంవత్సరాల వయసుగల వికలాంగ పిల్లలను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ఇప్పటివరకు వివిధ వైకల్యాలు కలిగిన 35 మంది పిల్లలను గుర్తించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాసహితవిద్య సమన్వయకర్త బి.గీత పర్యవేక్షించారు. తల్లిదండ్రులకు భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, విద్యా బోధన తదితర అంశాల గురించి వివరించారు. ఈ పిల్లలకు ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్న టెక్నాలజీ ద్వారా విద్య, ఉపకరణాలు, అలవెన్సెస్, వైద్య సదుపాయాలు వినియోగించుకోవాలని కోరారు. పిల్లలకు పాఠశాలలో అందిస్తున్న విద్యా కానుక కిట్లను, డ్రె రేషన్‌ను విధిగా పొందాలన్నారు. ఈ నమోదు కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు బివి.నాగేశ్వరరావు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య కళాశాలలో సిబిసిటి స్కాన్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో ఏర్పాటుచేసిన అత్యాధునిక సిబిసిటి స్కాన్‌ను దంత వైద్య జాతీయ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత ఆధునిక పరికరం నోటి రోగాలను గుర్తించడం, చికిత్స ప్రణాళిక రూపకల్పనకు దోహద పడుతుందని తెలిపారు. కళాశాల డీన్ డాక్టర్ పివి.సుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి, దంత వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : జెఎస్ ఫర్ పీపుల్ ఫౌండేషన్ ఫౌండర్ జాగరపు శ్రీను ఆధ్వర్యాన దళ్లివానిపాలెంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాగరపు శ్రీను మాట్లాడుతూ, ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత 15 సంవత్సరాల నుంచి గాజువాక పరిసర ప్రాంతాల్లో ఎక్కడో ఒక దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తోకడ శ్రీను, తోకడ ముసలినాయుడు, దల్లి గురుమూర్తి, మొల్లి శ్రీను, రాజేంద్ర, దల్లిఎర్రోడు, మెరిండా, రవి, సంతోష్ పాల్గొన్నారు.

హెచ్‌పిసిఎల్ సిఎమ్‌డికి ఏయూ డాక్టరేట్

ప్రజాశక్తి-విశాఖపట్నం : హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సిఎమ్‌డి పుష్పకుమార్ జోషికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఏయూ హ్యూమన్ రిసోర్సెస్ విభాగం నుంచి 'అక్షయపథ్- ఏ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ త్రూ ఎమోషనల్ అండ్ సోషల్ ఇంటిలిజెన్స్ కాంపిటెన్సీస్, ఏ కేస్ స్టడీ ఇన్ హెచ్‌పిసిఎల్ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. శనివారం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను పుష్పకుమార్ జోషి స్వీకరించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ నిర్వహిస్తున్న స్టార్టప్ ఇంక్యుబేషన్‌తో అనుసంధానం అవడం, ఏయూ అభివృద్ధిలో భాగం అవుతామని పుష్పకుమార్ జోషి తెలిపారు. ఏయూలో విభిన్న అంశాలలో సాధిస్తున్న ప్రగతిని వీసీ ప్రసాదరెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

ఉడా లే-అవుట్ల స్థలాలకు డ్రా



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

ప్రజాశక్తి- లీగల్ : విశాఖపట్నం సిటీ అడ్వకేట్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యాన ఉడా లే-అవుట్ స్థలాల డ్రా శనివారం న్యాయవాదుల సంఘం గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ హాజరై న్యాయవాదులకు స్థలాల ఏర్పాటుచేసిన సొసైటీని అభినందించారు. బ్యాంకు ఉద్యోగుల, డాక్టర్ల... ఇలా అనేక వృత్తిపరమైన కాలనీలు ఉంటున్నాయని, అదేవిధంగా ఈ సొసైటీ ద్వారా న్యాయవాదుల కాలనీలు ఏర్పాటుచేయడం మంచి పరిణామం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సొసైటీ ప్రధాన కార్యదర్శి మొక్కల పుక్కల నాగరాజు ఆధ్వర్యాన 80 మంది సభ్యులకు స్థలాలను డ్రా ద్వారా కేటాయించారు. ఈ లే-అవుట్‌ని మరింత అభివృద్ధి చేస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నూకల వెంకటేశ్వరరావు, కోడి శ్రీనివాసరావు, జెవిని రాఘవేంద్రరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బెవర సత్యనారాయణ, దంతా నరేష్ కుమార్, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, మెంబర్లు కె.రామజోగేశ్వరరావు, పి.నర్సింగరావు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన వీసీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం డిగ్రీ ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. సత్య డిగ్రీ కళాశాలకు చెందిన బిబిఎ విద్యార్థిని కొమ్మూరు రమ్య యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. కళాశాల విద్యార్థినులు కె.రమ్య, టి.ఊర్మిళ విజయనగరం జిల్లాలో ప్రథములుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, సత్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి.సాయి దేవమణి, విభాగాధిపతి ఎస్.వరూధిని పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు వ్యవసాయశాఖ సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

- రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందించాలి
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి- అనకాపల్లి: రాష్ట్రంలో వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా రైతులకు అవసరమైన, సరిపడా వరి, వేరుశనగ, నువ్వులు, చిరుధాన్యాల విత్తనాలు, ఎరువులు సిద్ధంగా అందజేయాఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మ(ద్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలోజిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతాంగానికి అవసరమైన విత్తనాలు ఎరువులను రాయితీపై రైతుభరోసా కేంద్రాల ద్వారా వెంటనే అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. రైతులందరికీ పెట్టుబడులకు అవసరమైన రుణాల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు అందించాలన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి, ఏయే పొలాల్లో ఏ రకం పంటలు సాగుచేయాలో, ఎరువుల మోతాదుపైనా రైతులకు అవగాహన కలిగించాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానులకు సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అవకతవకలమయమైన భూసర్వేను రద్దుచేసి రైతుల సమక్షంలో గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు రీసర్వే చేసి పాసు పుస్తకాలను సవరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విత్తనాలు కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులు రాష్ట్రంలో తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ,మండల స్థాయిలో రైతులను చైతన్యపరిచి రైతాంగ సమస్యలు పరిష్కరించేందుకు కార్యకర్తల కృషిచేయాలన్నారు సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కమిటీ సభ్యులు గండి నాయనబాబు, బి.నాగేశ్వరరావు, ఎ.అప్పలరాజు, ఎన్.సత్యనారాయణ, పి.కోటి, దేముళ్ళు, బి.రంగారావు పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు
ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్ పరిశోధన సహసంచాలకులు, వ్యవసాయ ఎ వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివికె జగన్నాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 17 ప్రభుత్వ, 55 వ్యవసాయ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయన్నారు.అనకాపల్లి కాలేజీలో రెండేళ్ల వ్యవసాయ పాలిటెక్నిక్, మూడేళ్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో పదవ తరగతి పాస్, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు అర్హులని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్లు పూర్తయిన వారు అర్హులన్నారు. న. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో చదివినవారికి 75: 25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. ఎటువంటి ఫీజు చెల్లించనక్కర్లేదని, ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జూన్ ఒకటి నుంచి ప్రారంభమై 20వ తేదీతో ముగుస్తుందన్నారు. దరఖాస్తులు, ఇతర సమాచారం కోసం angrau.ac.in వెబ్‌సైట్ లేదా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల 63048 52859, 9966244225, 89774 51972 నెంబర్లను కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలన్నారు.

గోరుముద్దపై మండల స్థాయి శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న డిఇఒ వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి. -సబ్బవరం : మండలంలోని స్థానిక అంబేద్కర్ గురుకులంలో గోరుముద్దపై మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మండల స్థాయి శిక్షణ నిర్వహించినట్లు ఎంఇఒ బిఎస్ఎన్ మూర్తి తెలిపారు. డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ, గోరుముద్దపై నిర్వాహకులకు ఆరు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలల్లో విద్యార్థులకు నాణ్యత, రుచికరమైన భోజనం అందించాలని కోరారు. ఈ సందర్భంగా తయారు చేసిన ఆరు రకాల వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఇఒ ఎస్ లక్ష్మణరావు సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని భోజన నిర్వాహకులకు ఎంఇఒలు కె.సత్యనారాయణ డివిడి ప్రసాద్ సూచించారు. శనివారం భోజన నిర్వాహకులకు స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో శిక్షణ ఇచ్చారు. రుచిగా వండే నిర్వాహకులకు బహుమతులు అందించారు. విద్యార్థులకు పోషక విలువలను ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, దానికి నిర్వాహకులు సహకరించాలని ఎంపిడిఒ బిఎస్‌కెఎస్.పట్నాయక్ కోరారు కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ వరలక్ష్మి, మధ్యాహ్నం భోజన పరిశీలకులు కె.రామలింగేశ్వరరావు, ఉపాధ్యాయ యూనియన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, పోతల నాయుడు బాబు, సతీష్ స్థానిక హెచ్ఎం పద్మావతి, ఇఒపిఆర్‌డి ప్రసాద్ పాల్గొన్నారు.

దేవాలయ భూములకు రక్షణ కల్పించండి

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 115 లో కోట్లాది రుపాయల విలువ చేసే 23.15 ఎకరాల దేవాదాయ భూముల పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలని, తక్షణమే ఆయా భూముల్లో బోర్డులను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న డిమాండ్ చేసారు ఈ భూములపై కవిత అగ్రిఫామ్ యాజమాన్యం హైకోర్టును అశ్రయించిందన్నారు.



ఇతరుల ఆక్రమణతో కోర్టు వివాదంలో ఉన్న దేవాలయ భూములు

గతంలో మారేపల్లి గ్రామానికి చేందిన అవుగడ్డ సఖూరినాయుడు సీతారాముల దేవస్థానానికి ఈ భూమిని దానం చేయగా 1956 లో సెటిల్‌మెంటు, ఫెయిర్ ఆడంగల్‌లో నమోదైందన్నారు. అదే సెటిల్‌మెంట్, ఫెయిర్ అడంగల్‌లో అల్లు గౌరునాయుడు తన పేరు రాయించుకోగా, భూమిని సాగుచేస్తున్న తారువా గ్రామానికి చెందిన రైతులు 1999 లో మున్సిపల్ సీవిల్ జడ్జి కోర్టులో కేసు వేయగా, కోర్టు దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అయినప్పటికీ రైతులు తప్పుడు రికార్డులు సృష్టించి కవిత అగ్రిఫామ్ యాజమాన్యానికి భూములను విక్రయించారన్నారు. దీనిపై రెండేళ్లుగా సిపిఎం పోరాటం చేస్తోందన్నారు. దీనిపై దేవదాయ శాఖ అధికారులు స్పందించి కవిత అగ్రిపామ్ వేసిన వెంచర్లు అనధికారికమని, క్రయవిక్రయాలు చెల్లుబాటు కాదంటూ నిలుపుదల చేశారన్నారు. దీనిపై గతేడాది అక్టోబర్ 10న కవితా ఆగ్రోఫాం కోర్టులో పిల్ దాఖలు చేయగా, దేవాదాయశాఖ దానికి కౌంటర్ దాఖలు చేసిందన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో పెండింగ్‌లో ఉంది. కోర్టు తీర్పు వచ్చేంత వరకు దేవాలయ భూములు దేవాదాయశాఖలో ఉడేలా ఆయా భూముల్లో బోర్డులు ఏర్పాటుచేసి, అన్యాక్రాంతం కాకుండా చూడాలని వెంకన్న కోరారు.

శ్మశానవాటిక స్థలం దురాక్రమణపై చర్యలు తీసుకోండి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని సబ్బవరం రెవెన్యూ పరిధిలోనిగొల్లువానిపాలెం గ్రామంలోని సర్వేనెంబర్ 258లో ముస్లిం మైనార్టీలకు శ్మశానవాటికకు కేటాయించిన 2.35ఎకరాల భూమిని కొంతమంది దురాక్రమణ చేస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ముస్లిములు కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విశాఖ ఉమ్మడి జిల్లా కలెక్టరుకు2022 మార్చి 21న ఫిర్యాదు చేశామని, అలాగే హైకోర్టులో లో న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో షేక్ రహీం బీబీ, షేక్ కరీం,షేక్ చెల్లా సాహెబ్, షేక్ బాబ్జి, షేక్ ఖాన్ సాహెబ్, షేక్ నాగూర్ మైనార్టీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన నిర్వాహకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో బాల,బాలికలకు 'భారత జాతీయ జెండా'పై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులుఅందజేశారు. శనివారం చినరాజుపేట సాంబశివ దేవాలయ ప్రార్థనామందిరంలో నిర్వహించిన పోటీల్లో 35 మంది బాల,బాలికలు పాల్గొనగా, శిల్ప కళాకారులు పండూరి సత్యనారాయణ న్యాయనిర్ణేతగా వ్యవహరించి, ఐదు ఉత్తమ చిత్రాలకు బహుమతులను అందజేశారు. సిద్దార్థ అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేశ్ గుప్తా, ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు కొత్తూర్తి రామారావు, బొడ్డు సోమరాజు, సంస్థ గౌరవాధ్యక్షులు ఉజ్జి సత్యనారాయణ, దేవాలయ అధ్యక్షులు కాలెపు తాతాజీ, అర్చకులు నందు శర్మ, రేబాక వరహాలతల్లి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 15,16,17 తేదీలలో ఏలూరులో జరిగే రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి కోన మోహనరావు పిలుపునిచ్చారు. శనివారం అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో జిల్లా కమిటీ, అనకాపల్లి జిల్లా క్వారీ క్రషర్స్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మిక, రైతు కూలీ సంఘాల నాయకులు మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ, 70 ఏళ్లుగా ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా, రైతుల భూమి, సాగునీటి సమస్యలను పరిష్కరించలేదన్నారు. వ్యవసాయదారిత పరిశ్రమలైన షుగర్, జ్యూట్ ఫ్యాక్టరీలను మూసివేస్తూ, రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను దక్కనివ్వకుండా, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై పెత్తనాన్ని బహుళ జాతి, కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి కరువై పట్టణాలకు వలస పోతున్నారన్నారు. పాలకుల మోసపూరిత దోపిడీ విధానాలపై రైతాంగం, కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు బి.జగదీశ్వరరావు, మరిసా సతీష్, క్వారీ కార్మిక సంఘం నాయకులు గడి సూర్యారావు, ఎస్.సూరిబాబు, డి.జగ్గారావు, సిహెచ్ రమేష్, గొర్రపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

- యలమంచిలిలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ, పునశ్చరణలో ఆర్ఒ అనుపమ



ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఒ అనుపమ

ప్రజాశక్తి - యలమంచిలి : ఈనెల 4న ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు యలమంచిలి నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసరు అనుపమ తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కౌంటింగ్ సిబ్బందికి చివరి శిక్షణ, పునశ్చరణ తరగతులలో నాలుగు మండలాల రెవెన్యూ సిబ్బంది, కౌంటింగ్ సిబ్బంది పాల్గొనగా, వారి సందేహాలను నివృత్తి చేశారు. కౌంటింగ్ టేబుళ్ళ వద్ద ఎవరెవరు కూర్చోవాలో, ఐడెంటీ కార్డులు జారీ చేశారు. అప్రమత్తంగా ఉండి విధులు సక్రమంగా నిర్వహించాలని కోరారు.

యలమంచిలి నియోజకవర్గానికి 14 టేబుళు కేటాయించారని, ఒక్కో రౌండుకు 14 పోలింగ్ బూత్‌లకు చెందిన ఇవిఎంలు లెక్కిస్తారని, మొత్తంగా 246 పోలింగ్ బూత్‌ల లెక్కింపు 18 రౌండ్లలో పూర్తవుతుందన్నారు. ఓట్లలెక్కింపు ప్రక్రియలో ఎవరైనా ఏజెంట్లు మొండిగా వాదనలకు, అలజడి రేపడానికి ప్రయత్నిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇవిఎంల కౌంటింగ్‌కు అరగంట ముందుగా పోస్టల్ బ్యాలెట్‌లు లెక్కిస్తామని, వాటికోసం ప్రత్యేకంగా మరో టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. చేయడం జరిగిందన్నారు. హౌస్ ఓటింగ్‌లో పాల్గొన్న 131ఓట్లు, జూనియర్ కాలేజిలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఎంప్లాయిస్ 1433 మంది, ఇతర నియోజకవర్గాల్లో ఓటు వేసిన ఇక్కడి ఉద్యోగులు 356 మంది, సైనికులు మొదలైన సర్వీసు ఓటర్లు 376 మంది ఎలక్ట్రానిక్ బ్యాలెట్‌లు ఉపయోగించుకున్నారన్నారని, వీటిని ముందుగా లెక్కిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్, ఇతర కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీటీ స్కాన్ గదిని ఎప్పుడు తెరుస్తారు?

- ఎన్‌టిఆర్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ప్రశ్నించిన ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : పేద రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.1.80కోట్లతో ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ యంత్రాన్ని ఎపుడు వినియోగంలోకి తెస్తారని ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు ప్రశ్నించారు. శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావుతో సమావేశమై వైద్యాలయంలో పలు సమస్యలపై చర్చించారు. ఆరు నెలల కిందట ఆర్భాటంగా ఏర్పాటుచేసిన సిటి స్కాన్ యంత్రాన్ని పదిరోజుల్లో వినియోగంలోకి తెస్తామని ప్రకటించినా ఇంతవరకు మోక్షం లేదని ప్రశ్నించారు. సిటి స్కాన్ మెషిన్ ఉన్న గదిని నాటి నుంచి నేటివరకు తెరవకపోవడం ప్రజావైద్యం పట్ల ప్రభుత్వయంత్రాంగానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమౌతోందన్నారు. హామీలిచ్చి అటకెక్కించడం నేతలకు పరిపాటి అని, అదే విధానాన్ని అధికారులు వ్యవహరిస్తే పేదరోగులకు మెరుగైన వైద్యం ఎపుడు అందుతుందని ప్రశ్నించారు. ఆసుపత్రిలో కోట్లు ఖర్చుపెట్టి ఏర్పాటుచేసిన సిటి స్కాన్ ఉన్నా, రోగులకు వేలకు వేలు ఖర్చుపెట్టించేలా బయటకు పరీక్షలు రాయడం ఎంతవరకు సబబన్నారు.


ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో సమావేశమైన ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు

ఆసుపత్రిలో మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, గైనిక్ వార్డులో రోగులు కూర్చునేందుకు కూడా కుర్చీలు లేకపోవడంతో నిండుగర్భిణులు గంటల తరబడి నిలబడి అవస్థలు పడుతుండడం మీ దృష్టికి రాలేదాయని సూపరెంటిండెంట్‌ను నిలదీశారు.

సమస్యలపై స్పందించిన వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, మరి కొద్దిరోజుల్లో సిటీ స్కాన్ అందుబాటులోకి తీసుకొస్తామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిన్నియాదవ్, ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, అంబేద్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు రావి దేవుళ్ళు పాల్గొన్నారు.

సిఎస్ భూదందాలపై సిట్ విచారణ : బుద్ధ

ప్రజాశక్తి-.అనకాపల్లి : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి అతని కుమారుడు, అనుచరుడు త్రిలోక్ కలిసి భోగాపురం పరిసర ప్రాంతాల్లో 800 ఎకరాల భూ దందాపై సిట్‌తో సమగ్ర విచారణ జరిపించాలని, జవహర్‌రెడ్డిని విధుల నుంచి తప్పించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం పార్లమెంట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దీనిపై కేంద్రం ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూముల జిఒ 596ను అడ్డం పెట్టుకొని డిపట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులతో బినామీల పేరట రిజిస్ట్రేషన్ చేయిస్తున్న బాగోతం బయటపడినా విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున గాని ఉత్తరాంధ్ర మంత్రులు గానీ నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందని నాగ జగదీష్ ప్రశ్నించారు. విశాఖను రాజధానిగా చేస్తామని ప్రభుత్వ ప్రకటనతో అక్రమాలకు భూదందాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని, బిల్డ్ ఏపీ పేరుతో 6,116 ఎకరాల భూమిని దళితులు, సన్న కారు చిన్న కారు రైతులు జిరాయితీ భూములను వైసిపి మంత్రులు ఎమ్మెల్యేలు నాయకులు కారు చౌక కొనుగోలు చేశారన్నారు. విశాఖపట్నంలో రుషికొండ, దర్భండ, కుసులవాడ ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు కబ్జా ఆరోపణలపై స్పందించకపోవడం దారుణమన్నారు. భూదందాలకు కొమ్ముకాస్తున్న జిల్లా కలెక్టర్ బదిలీ అయితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కెకెవిఎ నారాయణరావు మాట్లాడుతూ, కడప నుంచి వచ్చి శ్రీకాకుళం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూదందాలకు పాల్పడుతున్నారని వైసిపి నేత మంత్రి ధర్మాన ప్రసాదరావు గతంలో చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ చేయాలన్నారు. సమావేశంలో పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ ఉపాధ్యక్షులు బోడి వెంకటరావు, పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి విల్లూరి రమణ బాబు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



గ్రామాల్లో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని నలుగురికి మించి గుంపులుగా గుమిగూడి ఉండరాదని బుచ్చయ్యపేట ఎస్ఐ డి ఈశ్వరరావు హెచ్చరించారు.. శనివారం మండలంలోని పలు గ్రామాలలో మైకు ద్వారా ప్రచారం నిర్వహించారు కౌంటింగ్ రోజున సభలు సమావేశాలు ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఎన్నికల ఫలితాలపై ఎవరైనా బెట్టింగులకు పాల్పడినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. హింసాత్మక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

మునగపాక: కౌంటింగ్ వేళ ఎటువంటి అవాంఛనీయ ఘటలనకు ఆస్కారం లేకుండా ప్రజలంతా సహకరించాలని స్థానిక ఎస్ఐ పి. ప్రసాదరావు కోరారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. ఎగ్జిట్ పోల్స్, ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత .ఉద్దేశపూర్వకంగా గొడవలు చేసినా, రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం, ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధమన్నారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు : శుక్రవారం అర్ధరాత్రి పిడుగులతో కూడిన గాలివాన బీభత్సం సష్టించింది. రెండు మూడు గంటలసేపు ఆగకుండా పిడుగులు పడుతూనే ఉన్నాయి. పిడుగులు దెబ్బకుకోటపాడులో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయాయి. విద్యుత్తు వైర్లకు వాడే పింగాణి డిస్కులు పిన్నులు దెబ్బతున్నాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ వైర్లపై చెట్లు విరిగి పడటంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. శనివారం రోజంతా ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరా అంతరాయంతో ఎప్పుడు కరెంటు వచ్చేది చెప్పలేమని ఎఇ సుధాకర్ తెలిపారు.

ఆర్ఇసిఎస్ ఎమ్‌డిపై కోర్టు ధిక్కరణ పిటిషన్

- పాలిటెక్నిక్ కాలేజీ పూర్వ ప్రిన్సిపల్ ఉమాశంకర్

ప్రజాశక్తి- కశింకోట : హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేసిన కశింకోట ఆర్ఇసిఎస్ ఎండి, రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కాలేజీ కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్న విశాఖపట్నం జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎం.శ్యామల పై హైకోర్టులో కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశానని, కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఉమాశంకర్ తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, ఆర్ఇసిఎస్ ఎండిగా రామకృష్ణం రాజు, అధికారిక చైర్మన్ ఎం.శ్యామల నిధుల దుర్వినియోగం, ఉద్యోగాల అక్రమ భర్తీ వంటి విషయాలలో సహకరించని కారణంగా, అనధికార మౌఖిక ఆదేశాలతో తనకు సగం జీతం ఇవ్వడంపై ప్రశ్నించినందుకు ఆర్థిక ఆరోపణలు చేశారన్నారు. ప్రైవేటు పాలిటెక్నిక్ వ్యవహారాలపై దర్యాప్తుకు ఆదేశం, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునే అధికారం సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌కు ఉండగా, డిప్యూటీ రిజిస్ట్రార్ హోదా కలిగిన సహకార శాఖకు చెందిన వీరు, తమకున్న పలుకుబడితో అదే డిప్యూటీ రిజిస్ట్రార్ హోదా గల జిల్లా సహకార అధికారితో సహకార చట్టం ప్రకారం దర్యాప్తు చేయించారన్నారు. అకడమిక్ వ్యవహారాలు చూసే తనపై ఆర్థిక పాలనా పరమైన అభియోగాలు మోపి, జనరల్ బాడీ సమావేశంలో చర్చకు ప్రవేశపెట్టని పక్షపాత నివేదికలతో తనను 19 ఏప్రిల్ 2021 సస్పెండ్ చేశారన్నారు. అంతర్గత విచారణ పేరుతో తన కిందిస్థాయి ఉద్యోగులు ఇంగ్లీష్ లెక్చరర్ బి.జగన్మోహిని, విభాగాధిపతి సరగడం గణేష్‌లను విచారణ, ప్రెజెంటింగ్ అధికారులుగా నియమించారన్నారు. తనతో బలవంతంగా ప్రిన్సిపల్ ఉమాశంకర్‌పై ఆరోపణలు చేయించారని దర్యాప్తు సమయంలో వైస్ ప్రిన్సిపల్ కర్రిశివ అంగీకరించినా, దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, ఏకపక్షంగా ఆరోపణలన్నీ వాస్తవాలేనని నిర్ధారించి, తనను 2022 జూన్ 6న ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. దీనిపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తొలగింపు ఉత్తర్వులు చట్ట విరుద్ధమని రద్దుచేయడంతోపాటు, తనను విధుల్లోకి తీసుకోవాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా ఎండి శ్యామల అమలు జరపకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద ఆమెపై పిటిషన్ వేశానన్నారు.


హైకోర్టు ఉత్తర్వులుచూపుతున్న పూర్వ ప్రిన్సిపల్ ఉమాశంకర్

తప్పిన పెను ప్రమాదం

- ఈదురుగాలులకు విద్యుత్ టవర్ నేలమట్టం
- భయంతో ఇళ్లల్లోంచి పరుగులు తీసిన జనం
- ఎపి ట్రాన్స్‌కో నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు

ప్రజాశక్తి-పరవాడ: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులకు గొర్లివానిపాలెం బంగారు మామ గుడి దగ్గరలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన 220 కెవి ట్రాన్స్‌మిషన్ భారీ విద్యుత్ టవర్ నేలమట్టం అయింది. భారీ విద్యుత్ వైర్లు తెగి దగ్గరలో ఉన్న ఇండ్లపై పడడంతో భారీ శబ్దం రావడంతో ఏం జరిగిందో అర్థం కాక జనం ఇళ్లల్లోంచి బయటకు పరుగులు తీశారు .కూలిన టవర్ దగ్గరలో ఎటువంటి జనావాసాలు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నాలుగు నెలల క్రితమే గౌతలచ్చన్న నగర్ నుండి నేలమట్టమైన విద్యుత్ టవర్ వరకు పాత వైర్లు తొలగించి కొత్తవైర్లు వేశారు. ఇప్పుడు ఈ వైర్లన్నీ తెగి కింద పడిపోయాయి. ఈ టవర్‌కు ఉన్న నాలుగు లెగ్‌ల వద్ద కిందన తుప్పు పట్టి బలహీనం కావడంతో ఈదురుగాలులకు కూలిపోయిందని భావిస్తున్నారు. ఏళ్లక్రితం ఏర్పాటు చేసిన టవర్ కావడం వల్లే ప్రమాదం జరిగిందని, ఇటీవల విద్యుత్ వైర్లు మార్చినప్పుడు టవర్ కింద భాగాన పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటే ఇంతటి ప్రమాదం జరిగేది కాదని, దీనిలో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం ఉందని స్థానికులు మండిపడుతున్నారు. విద్యుత్ టవర్ కూలిపోవడంతో పరవాడ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం వరకూ విద్యుత్‌కు అతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, భారీ విద్యుత్ టవర్ల ప్రస్తుత పరిస్థితిపై దృష్టిపెట్టి, బలహీన పడిన వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు..



కూలిన 220 కెవి భారీ విద్యుత్ టవర్

పెదపల్లి వార్డులో కార్డన్ సెర్చ్

సరైన ధ్రువపత్రాలు లేని 31బైక్‌లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

ప్రజాశక్తి - యలమంచిలి : ఎన్నికల కౌంటింగ్ వేళ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని పెదపల్లి వార్డులో కార్డన్ సెర్చ్ నిర్వహిచారు. ఎస్‌సి మురళీకృష్ణ ఆదేశాలతో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 31 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ. షేక్ గఫూర్ తెలిపారు తెలిపారు. బైక్‌లకు సంబంధించిన సరైన ధృవపత్రాలు రెండ్రోజుల్లో సమర్పించి వాటిని తీసుకోవచ్చని సూచించారు.ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత ప్రశాంత వాతావరణానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్డన్ సెర్చ్‌లో యలమంచిలి టౌన్, రూరల్, మునగపాక ఎస్ఐలు పాపినాయుడు, చంద్రశేఖర్, ప్రసాదరావు పలువురు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని మారుమూల గిరిజన గ్రామం మాకనాపల్లిలో గిరిజనులకు గాజువాక వెంపలినగర్‌కు చెందిన గల్లా శంకర సాయిరాం ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర వస్తువులను అందజేశారు. ఆ గ్రామాన్ని దత్తత తీసుకొని ప్రతి నెలా గిరిజనులకు నిత్యావసరాలను అందిస్తున్నామని శంకర సాయిరాం తెలిపారు. రోడ్డు, తాగునీరు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు అనంతరం గ్రామంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో రామారావు, సూరిబాబు, మనోహర్, రమేష్‌నాయుడు. లెక్కల సత్యన్నారాయణ. రామానాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యకాస నేత నరసింహమూర్తి

ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పలివ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - మాడుగుల: ఉపాధి హామీ కూలీలకు ప్రతి వారం పే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఇరట నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలో కాశీపురం పంచాయతీలో పెదకూర్మనాదపురం, ద్వారకానగర్, చినకూర్మ పని ప్రదేశాలలో పర్యటించారు. ఉపాధి కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజుకు రూ.300 కూలి ఇస్తున్నామని చెప్పినా కూలీలకు అమలు కాలేదన్నారు. ఎవరికి ఎంత కూలి పడుతుందో తెలుసుకునే విధంగా గతంలో పే స్లిప్పు ఇచ్చేవారని, ప్రస్తుతం ఇవ్వలేదని తెలిపారు. ప్రతివారం పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. ఎండవేడికి ప్రభుత్వం ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీరు సౌకర్యం కల్పించాలన్నారు. 30 శాతం వేసవి అలవెన్సు ఇవ్వాలని, ప్రతి 15 రోజులకి ఒకసారి పని చేసిన కూలి డబ్బులు ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్టు పెట్టాలని, సంవత్సరానికి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు కూలీ 600 ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో కూలీలు దురదృష్టవశాత్తు మరణిస్తే 10 లక్షలు ఆ కుటుంబానికి ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చీర ఎరుకు నాయుడు, చీర తలుపులునాయుడు, జోగా కృష్ణారావు, నక్కని కోటేశ్వరరావు, నెల్లూరు శ్రీను, నెల్లూరు పోతురాజు పాల్గొన్నారు.

ఉదయం వర్షం.. మధ్యాహ్నం ఎండ ..

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో శనివారం భిన్న వాతావరణం చోటు చేసుకుంది. తెల్లవారుజాము రెండు గంటల ప్రాంతంలో ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో చల్లటి గాలులు వీస్తూ ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. భారీ వర్షం కురుస్తుందని అంతా భావించినప్పటికీ, వరుణుడు కొద్దిపాటి వర్షంతో సరిపెట్టాడు. వర్షం కురవడంతో ఉదయం 10 గంటల వరకు వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ, మధ్యాహ్నంకు ఎండ తీవ్రత పెరిగింది. గత ఐదు, ఆరు రోజుల నుండి భానుడు నిప్పులు గక్కడంతో జనం ఉక్కిరి బిక్కిరయ్యారు. ఇటువంటి సమయంలో తెల్లవారు జామున వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో చల్లబడటంతో కొద్ది సమయం అంతా ఉపశమనం పొందారు. రోజంతా ఇలానే హాయిగా ఉంటుందని భావించినప్పటికీ ఇంతలోనే ఎండ తీవ్రత పెరిగింది.


కురుస్తున్న వర్షం


రక్తదాన శిబిరానికి హాజరైన బండారు, పివిజి.కుమార్

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- చీడికాడ: మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు జన్మదిన వేడుకలు మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో ఆయన స్వగృహం, పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గవిరెడ్డి రామానాయుడుకి జన్మదిన వేడుకలు మాజీ మంత్రి, ప్రస్తుతం మాడుగుల తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి, నియోజకవర్గ ఇన్చార్జి పివిజి కుమార్లు తెలియజేశారు. జన్మదిన సందర్భంగా కార్యకర్తలు నాయకులు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించారు. కొంతమంది కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు కార్యక్రమంలో ఎంపిటిసిలు దారపు పెద్ది నాయుడు, గాడి నాగరత్నం, ప్రసాద్, పైల ముత్యాలనాయుడు, సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుతో నష్టంపై..

అధికారులకు తెలియజేస్తాం : ఎంపిపి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తాడిగుడ జలపాతానికి 45 అడుగుల మేర రోడ్డు విస్తీర్ణంతో వైయస్సార్ కాలనీ, పెద్దుఉరు గ్రామాలకు నష్టంపై సంబంధిత ఉన్నత అధికారులకు విన్నవిస్తానని స్థానిక ఎంపిపి శెట్టి నీలవేణి స్పష్టం చేశారు గ్రామాలలో శనివారం సందర్శించిన ఆమె మాట్లాడుతూ, గ్రామాల మీదుగా రోడ్డు విస్తరణకు అధికారులు కొలతలు వేసి ఇల్లు, కిరాణా దుకాణాల తొలగించాలని నోటీసులు అందజేశారన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యామ్నాయ మార్గం కోసం కృషి చేస్తానని ఆమె అన్నారు. గ్రామ సభ ఏర్పాటు చేసి స్థానిక ప్రజల అభిప్రాయాల మేరకే రోడ్డు పనులు ముందుకు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ మండల అధ్యక్షులు శెట్టి ఆనంద్, గ్రామ పెద్దలు దోనేష్, రమేష్ నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి

'మధ్యాహ్న' నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి-పెదబయలు : సీతగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ గిడ్డి అప్పారావు నాయుడు మాట్లాడుతూ, పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. రోజువారీ మెనూ విధిగా అమలు చేయాలన్నారు. ఆహారం రుచికరంగా, పరిశుభ్రంగా అందించాలన్నారు. అనంతరం నిర్వాహకులకు రోజు వారి మెనూపై వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన నిర్వాహకులకు బహుమతులు అందచేశారు. మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ, నిర్వాహకులు బాధ్యతగా విధులు నిర్వహించి వంటలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం సమన్వయ కర్త వంపూరూ వెంకటరమణ, కో ఆర్డినేటర్ ప్రవీణ్, సిఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

జోరుగా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీ చురుగ్గా సాగుతోంది. శనివారం ఉదయం నుంచి ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో మంచాన ఉన్న లబ్ధిదారుల ఇళ్లవద్దకే నేరుగా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. వితంతువులు, కొంతమంది వృద్ధులకు బ్యాంకు అకౌంట్లలో పెన్షన్ సొమ్ము జమ చేశారు. బ్యాంకుల్లో జమ అయినవారు బ్యాంకులకు పెన్షన్ల కోసం బ్యాంకుల్లో బారులు తీరారు. కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులు తమ ఖాతాల్లో జమ అయిన పింఛను సొమ్ములను ప్రయివేటు బ్యాంకులు, బ్యాంకు మిత్రల నుంచి తీసుకుంటున్నారు.

విద్యార్థులకు బహుముఖ పోటీలు


నర్సీపట్నంలో యోగా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చీడికాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు, చిన్నారులకు డ్రాయింగ్ పోటీలను మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించారు. కథలను చదివించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించామని గ్రంథాలయ అధికారిని ఎంఎస్ఎల్ జోగేశ్వరి తెలిపారు.

కోటవురట్ల: విద్యార్థులు గ్రంథాలయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి సద్వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు కోరారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు దేశ నాయకుల జీవిత కథలతో పాటు నీతి కథల పుస్తకాలు తరచూ చదువుతూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు కొనసాగింది. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ యోగాతో ఉపయోగాలు చేసి చూపించారు. పిల్లలతో చేయించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు వాతావరణంలో జరిగే మార్పులు, రుతుపవనాలు ఏ విధంగా ఏర్పడతాయో వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయులు రవికుమార్ మందార పువ్వు వేసి పిల్లలతో వేయించారు.పిల్లలందరికి బిస్కెట్లు పంపిణీ చేశారు.

గొలుగొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో శనివారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ విశ్వనాధుని రాజబాబు ఇంగ్లీషు స్పెల్లింగ్లకు అర్థం అడిగారు. అదేవిధంగా ప్రతిరోజు గ్రంథాలయానికి రావాలని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



గొలుగొండలో...


భీమిలిలో..

భీమునిపట్నం : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. పరుగు పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు

యలమంచిలి : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు నృత్య సాంస్కృతిక పోటీలు శనివారం నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి వి.ఆనంద్ తెలిపారు. అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు. డిగ్రీ కాలేజీ మాజీ వైస్ ప్రిన్సిపల్, పూరీ జగన్నాథ్, రిటైర్డు ఉపాధ్యాయులు యలమంచిలి అప్పారావు, పిడి. దుర్గారావు చిన్నారులను నృత్యపోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించారు. గ్రంథాలయాల సేవలు భావితరాలకు మరింత చేరువ కావాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థులకు ఆసక్తి కలిగించే కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని సందర్శకులు ప్రశంసించారు.



పక్షోత్సవాలు చేపడుతున్న సిబ్బంది

ఎన్టిపిసి సింహాద్రిలో

ముగిసిన స్వచ్ఛత పక్షోత్సవాలు

ప్రజాశక్తి - పరవాడ

ఎన్టిపిసి సింహాద్రి సిఎస్ఆర్ కార్యక్రమాలలో భాగంగా పరిశుభ్రత, సామాజిక సేవల్లో తన అంకితభావాన్ని తెలుపుతూ పక్షం రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాలు ముగిశాయి. ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ప్రారంభించిన పక్షోత్సవాల ముగింపులో సవ్యస్ భవనంలో ఉద్యోగులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛతా పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా సామూహిక పరిశుభ్రత ప్రతిజ్ఞలు, స్వచ్ఛత సెమినార్లు క్లీన్నెస్ డ్రైవ్, ప్రభాత్ ఫేరిస్, నుక్కడ్ నాటకం, అవగాహన ప్రచారాలు, బీచ్ క్లీనింగ్, చెట్ల పెంపకం వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఎన్టిపిసి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు, జిఐఎమ్ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణ కోరారు. శనివారం నర్సీపట్నం రామచంద్ర ఫంక్షన్ హాలులో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కౌంటింగ్‌కు ముందు, తర్వాత, కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి పోలీసు భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ రోజు 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎటువంటి మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, పెన్, పేపర్ వాటిని ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతించమన్నారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని తెలిపారు. మందుగుండు సామగ్రిని కాల్చ కూడదని, గుంపులుగా ఉండకూడదని, శాంతి భద్రతలకు విఘాత కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అందరూ సమన్వయం వ్యవహరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖకు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో నర్సీపట్నం డీఎస్పీ మోహన్, సీఐలు,

శాంతి, సామరస్యంతో మెలగాలి : ఎస్‌పి

మాడుగుల : సమాజంలో శాంతి, సామరస్యంతో మెలగాలని ఎస్‌పి మురళీకృష్ణ స్థానిక వాసవి ఆడిటోరియంలో నిర్వహించిన శాంతి భద్రతల పరిరక్షణ అవగాహన సదస్సులో ఆయన అన్ని పార్టీ నాయకులకు అవగాహన కల్పించారు. ఎస్‌పి మాట్లాడుతూ,పోలింగ్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా శాంతియుతంగా నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో కూడా శాంతియుతంగా నిర్వహించడానికి సహకరించాలని కోరారు. వివిధ రకాలైన చట్టాలు అమల్లో ఉన్నాయని, వాటిని గమనించి అన్ని పార్టీ నాయకులు మసలు కోవాలన్నారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దామోదర్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.



మాడుగులలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఆర్ఓ గీతాంజలి

బాధ్యతగా విధులు నిర్వహించాలి

-ఆర్ఓ గీతాంజలి

ప్రజాశక్తి-నక్కపల్లి:ఓట్ల లెక్కింపును బాధ్యతగా నిబద్ధతతో, నిర్భయంగా నిర్వహించాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.గీతాంజలి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించి కౌంటింగ్ విధి, విధానాలపై వివరించారు. ఓట్ల లెక్కింపు పై అవగాహన కల్పించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, తర్వాత ఈవీఎంల లెక్కింపు ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రాంతంలోనూ, మీడియా సెల్ తదితర ప్రాంతాల్లో నిర్వహించాల్సిన విధులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓలు శ్రీకాంత్, సూర్యనారాయణ,కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



గాయపడిన మహిళ

మహిళకు గాయాలు

ప్రజాశక్తి -కోటవురట్ల :మండలంలో పందూరు గ్రామం వద్ద శనివారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. చింతపల్లి గ్రామం నుండి అడ్డరోడ్డు వైపు బుల్లెట్ పై వెళుతుండగా వెనక కూర్చున్న మహిళ చున్ని చక్రంలో పడి బిగుసు కోవడంతో మహిళ కిందపడి పోయింది. దీంతో, తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను స్థానికుల సహాయంతో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు,

మహిళ మృతదేహం కలకలం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం -చింతపల్లి రోడ్డులో శనివారం ఉదయం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని టౌన్ పోలీసులకు తెలియజేశారు. టౌన్ ఎస్సై ఈశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన మహిళ వయసు 45 సంవత్సరాలు ఉంటుందని, మహిళ గిరిజన మహిళగా భావిస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామన్నారు.

అసలే ఉక్కపోత.. ఆపై విద్యుత్ కోత

- అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కొత్తకోట:రావికమతం మండల కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గత వారం రోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుంది. నిత్యం విద్యుత్ అంతరాయం కారణం గా ప్రజలు అల్లాడు తున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించ డంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న తీవ్ర వేడి వాతావరణంతో ప్రజలు అల్లాడుతుంటే విద్యుత్ సరఫ రాలో నిత్యం అంతరాయం కలుగుతుంది. గత రెండు రోజులుగా విద్యుత్ సమస్య మరింత తీవ్రతరం కావడం తో స్థానికులు శుక్రవారం రాత్రి సబ్ స్టేషన్ ముట్టడి కి దిగారు. స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందితో గొడవకు దిగడంతో కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు స్పందించారు. వినియో దారుల కు నచ్చజెప్పి ఆ రాత్రి సమయంలో ఎటువంటి గొడవలు జరగ కుండా నివారించారు. అంతే కాకుం ఆ శాఖకు సంబంధించిన వడ్డాది సబ్ డివిజనల్ ఏడిఈ, మండల ఏఈలకు గ్రామంలో విద్యుత్ సమస్య పై వివరించారు. త్వరగా సమస్య పరిష్కరించాలని కోరారు. గ్రామంలో అనధికార విస్తర్లు కంచాలు తయారీ చేసే పరిశ్రమలు ఉన్నాయి. వాటి తయారీకి రాత్రి వేళలలో విద్యుత్ వినియోగిస్తుంటారు. అధిక విద్యుత్ వినియో గం కారణంగా విద్యుత్ లైన్‌లలో జంపర్లు లోడ్ తరచూ మరమ్మత్తులకు గురవుతున్నాయి. ఈ సమస్య తో గృహాలకు కూడా విద్యుత్ సరఫరా నిలిచి పోతోంది.



తులసి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

తులసి స్ఫూర్తితో .. అంగన్‌వాడీల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి స్ఫూర్తితో అంగన్‌వాడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి కుమార్ కోరారు. శనివారం మర్రిపాలెం ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద తులసి సంతాప సభ నిర్వహించారు. తులసి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, జనవరి నెలలో 42 రోజులు నిరవధిక సమ్మె చేసి సాధించుకున్నటువంటి జివోలను అమలు చేయించుకోవాలంటే పట్టుదలతో పోరాడాలని కోరారు. అంగన్వాడీల సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారం అవుతాయని తెలిపారు. తులసి జిల్లా అధ్యక్షురాలుగా ఉంటూ కార్మికులను ఐక్యం చేయడంలో, ఉద్యమాలు నిర్వహించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆమె అకాల మృతి యూనియన్‌కు తీరని లోటని పేర్కొన్నారు. అర్బన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు నూకరత్నం వెంకటలక్ష్మిలు మాట్లాడుతూ, తులసి లేని లోటును యూనియన్‌లో ఎవరూ తీర్చ లేరని, సమిష్టి పని విధానం ద్వారా మాత్రమే ఆ లోటును భర్తీ చేయగలమన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ జ్యోతి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, బిపిఎ సన్నీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శోభారాణి యూనియన్ లీడర్లు ఉమా మంగరాజు, మంగ తదితరులు పాల్గొన్నారు.



పందూరు వద్ద నది

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-కోటవురట్ల:

మండలంలో సరిహద్దుల కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోలేదు. దీంతో విలువైన సహజ వనరులు అంతరించి పోతున్నాయి. అక్రమంగా ఇసుక రవాణా చేయడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి.

మండలంలో పందూరు వరాహనది, రాజుపేట సర్పా నది నుండి రాత్రి సమయంలో ఇసుకను యదేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు. రాయవరం, మాకవరపాలెం మండలాల నుంచి అత్యధికంగా వాహనాలు ఇక్కడికి వచ్చి తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. విలువైన సహజ వనరులు తరలించుకు పోకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎర్రంనాయుడు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-గొలుగొండ:సీపీఐ నాయకులు, గొలుగొండ మాజీ ఎంపీపీ లగుడు ఎర్రంనాయుడు ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. శనివారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామంలో లగుడు ఎర్రంనాయుడు 11వ వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రంనాయుడు స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రంనాయుడు నిరంతరం పేదల పక్షాన నిలబడి వారి సమస్యలు పరిష్కరించారని కొనియాడారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తూనే పార్టీ బలోపేతం కోసం ఎనలేని కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వి.రమణ, మాజీ మండల పార్టీ కార్యదర్శి లగుడు శ్రీను, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి.రాధాకృష్ణ, మండల పార్టీ కార్యదర్శి మేకా భాస్కరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-హుకుంపేట:స్థానిక పోలీస్ స్టేషన్లో ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కోరమ లక్ష్మణరావు దంపతులకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీడ్కోలు సభను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పాడేరు సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, ఉద్యోగం పట్ల నిబద్ధతతో లక్ష్మణరావు పని చేశారన్నారు. ఆయా పోలీస్ స్టేషన్లో 35సంవత్సరాలు సర్వీస్ అందించడం గొప్ప విషయమన్నారు. ఎటువంటి రిమార్కు లేకుండా నిజాయితీగా విధులు నిర్వహించిన లక్ష్మణరావుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.స్థానిక ఎస్సై సతీష్ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో లక్ష్మణరావు కీలకంగా విధులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్ర మంలో పోలీస్ శాఖ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.